క్లుప్తంగా

హిందీ పరీక్షకు 18,908 మంది హాజరు

రాయవరం: పదో తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన హిందీ పరీక్షకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 18,908 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 38 పరీక్షా కేంద్రాల్లో 19,003 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. హిందీ పరీక్షకు 95 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 9,524 మంది బాలురు, 9,384 మంది బాలికలు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు.

మండపేటలో సేవా కార్యక్రమాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కొమ్ము రాంబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కలువ పువ్వు సెంటర్, బస్టాండు, రాజారత్న సెంటర్‌లోని రిక్షా కార్మికులు, పేదలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని పలు సేవా సంస్థల్లో పేదలు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాలు చేశారు. తొలుత ఓం జ్యూయలర్స్ షోరూంలో రాంబాబును పార్టీ నేతలు ఘనంగా సత్కరించి కేక్ కట్ చేయించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'మా నమ్మకం నువ్వే జగనన్న'



వెదురుమూడిలో సమావేశమైన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో గురువారం 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న కార్యక్రమంపై గ్రామ స్థాయి కార్యకర్తలకు జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు దిశానిర్దేశం చేశారు. పలు గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పార్టీ యువ నాయకుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ పాల్గొననున్నారు. తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు నిడసనమెట్ట, అచ్యుతాపురం, వడ్లమూరు, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం

రామచంద్రపురం రూరల్: 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శుక్రవారం రామచంద్రపురం పట్టణంలో ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటలకు ముచ్చుమిల్లి మధ్య నగర్‌లో ఈ కార్యక్రమం ప్రారంభిస్తారని మంత్రి కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

మండపేట: మండపేట రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం శనివారం జరుగనున్నట్టు సంఘ కార్యదర్శి పెంకే గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రామహిందు మున్సిపల్ స్కూల్‌లో సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో ఇన్‌కంటాక్స్, ఈకేవైసీ, లైఫ్‌సర్టిఫికెట్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

బీజేపీ పాలనలో దేశం పురోగతి

కాజులూరు/కె.గంగవరం/రామచంద్రపురం: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాజులూరులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సలాది వీరబాబు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, బీజేపీ పాలనలోనే దేశం పురోగతి సాధిస్తోందని అన్నారు. పార్టీ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు పంచారు. కె.గంగవరం మండలం కోటిపల్లిలో జరిగిన కార్యక్రమంలో కర్రి చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి బీజేపీ జెండాను ఆవిష్కరించారు. రామచంద్రపురంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.రాఘవేంద్ర ఆధ్వర్యాన పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ సాధించిన ఘనతను సీనియర్ నాయకులు కొట్టువాడ హరిబాబు, యాండ్ర బుల్లబ్బులు వివరించారు.

ప్రజాసేవే పరమావధిగా..

- గ్రామాల్లో సర్పంచుల సేవలు
- అభివృద్ధి బాటలో పంచాయతీలు
- పంచాయతీ పాలనకు రెండేళ్లు
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సకాలంలో సేవలు



నేలటూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటి పర్యటనలో ప్రజాప్రతినిధులు (ఫైల్)

కపిలేశ్వరపురం: గ్రామానికి ప్రథమ పౌరుడు సర్పంచ్. సర్పంచ్ హోదా గ్రామానికి మణిహారం లాంటిది. రాజకీయాలపై ఆసక్తి, ప్రజలకు సేవ చేయాలన్న భావన ఉన్న వారు జీవితంలో ఒక్కసారైనా సర్పంచ్ కావాలని కోరుకుంటుంటారు. గ్రామాభివృద్ధి కోసం తపన పడుతుంటారు. అచ్చం అలానే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరుగుతోంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సకాలంలో అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. ఈ అభివృద్ధిలో పాలు పంచుకున్న సర్పంచ్‌లు పదవిని చేపట్టి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా ఈ కథనం..

సర్పంచ్ ఎన్నికల నేపథ్యమిదీ..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 120 గ్రామాల్లో 2021 ఫిబ్రవరి 13న ఎన్నికలను నిర్వహించారు. కాగా ఏప్రిల్ 3న ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేసి నూతన పాలకవర్గాలు పాలనా పగ్గాలు చేపట్టాయి. అదే రోజు తొలి తొలి పాలకవర్గ సర్వ సభ్య సమావేశం నిర్వహించి గ్రామ సమస్యలపై చర్చించనారంభించారు. కె.గంగవరం మండలంలో 4, రామచంద్రపురంలో 1, రాయవరం 2, కపిలేశ్వరపురంలో 3, మొత్తం 10 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 110 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించారు.

సమర్థ పరిపాలకులుగా మహిళా ప్రజాప్రతినిధులు

మండపేట నియోజకవర్గంలో 43కి 23 మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 77కి 37 మంది మొత్తం 120 గ్రామాలకు 60 మంది మహిళలు సర్పంచ్‌లుగా ఉన్నారు. 1,312 వార్డులకు గానూ 657 మంది మహిళలు వార్డు సభ్యులుగా ఉన్నారు. పాలనలో మహిళా ప్రజాప్రతినిధులు విశేషంగా రాణిస్తున్నారు. సభలు సమావేశాల్లో తమదైన శైలిలో ప్రసంగిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటున్నారు.

పాలనలో సామాజిక సమతూకం

మండపేట నియోజకవర్గంలో 8 మంది ఎస్సీ, 19 మంది బీసీ, మొత్తం 27 మంది సర్పంచ్‌లుగా ఉన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 19 మంది ఎస్సీ, 38 మంది బీసీ మొత్తం 57 మంది దళిత, వెనుకబడిన తరగతులకు చెందిన సర్పంచ్‌లున్నారు. మండపేట నియోజకవర్గంలో 16, రామచంద్రపురంలో 20 మొత్తం 36 మంది జనరల్ స్థానంలో సర్పంచ్‌లున్నారు. పంచాయతీ నిధులు, విధులు వినియోగంలో సామాజిక ప్రగతికి రథ చక్రాలుగా వారంతా నిలిచారు.

రెండేళ్ల పాలనాలో గ్రామాల అభివృద్ధి ఇలా

ఆర్థిక ఇబ్బందులను సైతం లెక్క చేయకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. ఒకప్పుడు సర్పంచ్ ఏలుబడిలో గ్రామ కార్యదర్శితోపాటు మరో ఇద్దరు ఉద్యోగులు మాత్రమే పంచాయతీలో ఉండేవారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో సచివాలయం ప్రజా సేవకు కేంద్రంగా మారింది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు మంచి ఫలితాలనిస్తున్నాయి. సచివాలయంలో 11 మంది ఉద్యోగులు వివిధ పథకాల నిర్వహణలో ప్రతినిత్యం పేదలకు సేవలందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు మంజూరు ఒక ప్రహసనంగా ఉండేది. నేటి ప్రభుత్వం అరగంటలో రేషన్ కార్డును మంజూరు చేసి చూపించిన ఘనత కలిగింది. రెండు నియోజకవర్గాల్లో అత్యధిక పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులే సర్పంచ్‌లుగానూ, వార్డు సభ్యులుగానూ గెలిచినప్పటికీ ప్రతిపక్ష పార్టీలను అభిమానించే పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం లబ్ధి చేకూరుస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లో పంచాయతీలిలా...

మండలం	మొత్తం సర్పంచ్‌లు	మహిళా సర్పంచ్‌లు	వార్డులు	మహిళా వార్డులు
రామచంద్రపురం	25	13	262	131
కె.గంగవరం	26	13	266	134
కాజులూరు	26	13	270	135
మండపేట	12	07	156	78
రాయవరం	12	06	148	74
కపిలేశ్వరపురం	19	1	210	105
మొత్తం	120	62	1,312	6,57

సంక్షేమమే నా ధ్యేయం



మండలంలోనే అత్యధిక మెజారిటీతో గ్రామ ప్రజలు నన్ను సర్పంచ్‌గా గెలిపించారు. వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల జీవితాల్లో సంతోషం చూస్తున్నాను. సంక్షేమానికి కేంద్రంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కేంద్రంగా పనిచేస్తున్నారు. పేదల్లో సంతోషాన్ని చూసి సర్పంచ్‌గా గర్వపడుతున్నాను.

–పెంకే కృష్ణవేణి, సర్పంచ్, కందులపాలెం

మైనర్ పంచాయతీలోనూ అభివృద్ధి



మైనర్ పంచాయతీ అయినప్పటికీ సుమారు రూ.కోటితో గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో గ్రామం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లేందుకు బైపాస్ నిర్మాణం జరిగింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.20 లక్షలు నిధులతో బీసీ, ఎస్సీ కాలనీల్లో సీసీ రహదారులు, డ్రైన్లు చేపట్టినందుకు సర్పంచ్‌గా సంతోషంగా ఉంది.

– గారపాటి సౌజన్య, సర్పంచ్, మెర్నిపాడు

వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రామచంద్రపురం రూరల్: రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం మరో వారం రోజుల్లో ప్రారంభించనుందని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. ద్రాక్షారామ రైతుభరోసా కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, కొత్తగా రైతుభరోసా పథకానికి చేసుకోవాలనుకునే వారి కోసం రైతుభరోసా గ్రీవెన్స్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వెంటనే నమోదు చేయించుకోవాలని కోరారు. అలాగే ఈ-కేవైసీ చేయించుకోనివారు ఈ నెల 10వ తేదీ లోగా నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నక్కా నాగులు, సభ్యులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి విరాళాలు

కె.గంగవరం: పాల్వంచలోని యువసేన అనాథ శరణాలయానికి దంగేరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రూ.12 వేల విరాళాలు సేకరించి, గురువారం అందజేశారు. ఈ మొత్తాన్ని యువసేన సొసైటీ సభ్యులకు ఉపాధ్యాయులు సమక్షంలో అందించారు. వారిని అభినందిస్తూ సొసైటీ సభ్యులు ధ్రువపత్రాలు, మెడల్స్, మెమెంటోలు బహూకరించారు.

టెన్త్ పరీక్షలకు నూరు శాతం హాజరు

కాజులూరు: మండలంలో గురువారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు నూరు శాతం విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. కోలంక కేంద్రంలో 221 మంది, కాజులూరులో 284 మంది, గొల్లపాలెం కేంద్రంలో 179 మంది కలిపి మొత్తం 685 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. తొలి రోజు గొల్లపాలెం సెంటర్‌లో ఒక్క విద్యార్థి పరీక్షలకు గైర్హాజరవగా, రెండో రోజు నూరు శాతం హాజరయ్యారని చెప్పారు.

డబ్బు లేక ఎవ్వరూ వైద్యానికి దూరం కారాదు

- అదే సీఎం జగన్ ఆశయం
- మంత్రి చెల్లుబోయిన వేణు
- ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం



గొల్లపాలెంలో పీహెచ్‌సీలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించి, వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి వేణు

కాజులూరు: డబ్బులు లేక ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధ పడకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గొల్లపాలెం పీహెచ్‌సీలో గురువారం ఆయన ప్రారంభించారు. కొత్తగా మంజూరైన 104 వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదల నాడి తెలిసిన వైద్యుడిగా నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టారన్నారు. ఆ పథకానికి ఆయన మరణానంతరం వచ్చిన పాలకులు తూట్లు పొడిచారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీకి పూర్వ వైభవం తీసుకువచ్చారని, వైద్య సేవలను మరింత విస్తరించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు, మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపీపీ మాత భారతి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురపుపేటలో..

రామచంద్రపురం రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా నరసాపురపుపేటలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పరమటి జ్ఞానలక్ష్మి ప్రారంభించారు. గ్రామ సచివాలయ పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను మండల వైద్యాధికారులు ప్రతి నెలా రెండుసార్లు సిబ్బందితో కలసి సందర్శిస్తారన్నారు. రోగులను పరీక్షించి మందులు ఇవ్వడంతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారికి ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణ మాట్లాడుతూ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉంటారని చెప్పారు. జనరల్ ఓపీ, నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ మేనేజ్‌మెంట్, గర్భిణుల ఆరోగ్య రక్షణ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని పిల్లల ఆరోగ్యంపై పర్యవేక్షణ, రక్తహీనత నివారణ వంటి సేవలు అందిస్తారని వివరించారు. 14 రకాల ల్యాబ్ పరీక్షలు, 70 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా స్థాయి స్పెషలిస్ట్ వైద్యుల సేవలను టెలి మెడిసిన్ పద్ధతిలో అందిస్తారని తెలిపారు. తొలి రోజు 343 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసంశెట్టి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక ప్రగతి

కపిలేశ్వరపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక ప్రగతి సాధిస్తుందని తాతపూడి సర్పంచ్ గూటం శ్రావణి, ఎంపీటీసీ సభ్యురాలు జుత్తుక వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని తాతపూడిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగర పీహెచ్‌సీ వైద్యురాలు జె.అనూజ ప్రియాంక శిబిరంలో వైద్య సేవలందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, కార్యదర్శి పి.మోహన్, హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీ కె.దీప్తి, 104 సిబ్బంది పాల్గొన్నారు.



తాతపూడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు, ప్రజాప్రతినిధులు

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి

మండపేట: గ్రామీణ ప్రజల చెంతకే వైద్యసేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలులోకి తెచ్చిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఇప్పనపాడులో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను గురువారం ఎంపీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. అర్తమూరులో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు ప్రారంభించారు. మండల వైద్యాధికారి ఎస్ సూర్యనారాయణరెడ్డి, వైద్యులు నవ్యశ్రీ, పి జగదీష్, పార్టీ నేత గొలుగూరి సందీప్‌రెడ్డి, వైద్య సిబ్బంది, అంగనవాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, నూతన కార్యవర్గంతో సంఘ నాయకులు

మండపేట: స్థానిక శెట్టిబలిజ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా పంపన శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో జరిగింది. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గుత్తుల సత్తిబాబు, కార్యదర్శిగా కుక్కల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, పెంకె గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ పటిష్టతకు, శెట్టిబలిజ సంక్షేమానికి పాటుపడతానన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, సంఘ నాయకులు పెంకే వెంకట్రావు, యాండ్ర ప్రభాకరరావు, గుత్తుల గోవిందు, గెద్దాడ అన్నవరం, చొల్లంగి గోవిందు, నామాల చంద్రరావు తదితరులు ఘనంగా సత్కరించారు. అలాగే నూతన కార్యవర్గానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, యువజన విభాగం నేత చోడే శ్రీకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎంపీపీ శ్రీనివాస్
- మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

మండపేట: సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. మండపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగింది. మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, ఎంపీడీఓ ఐ.రాజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. వ్యవసాయం, ఇరిగేషన్, విద్య, వైద్యం, అంగన్‌వాడీ, విద్యుత్ తదితర శాఖలకు సంబంధించి ప్రగతిని ఆయా శాఖల అధికారులు వివరించారు. గత సమావేశాల్లో వారి దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలు వెల్లడించారు. మండల వ్యవసాయాధికారి కె.ఏసుబాబు మాట్లాడుతూ రబీ కోతలు మొదలవుతున్న దృష్ట్యా రైతులకు అండగా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం గురించి వివరించారు. నిరాధరణకు గురైన చిన్నారులను ఈ పథకం కింద ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం మాట్లాడుతూ గ్రామంలోని దేవుడుతాళ్ల కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మారేడుబాకలో అంగనవాడీ కేంద్రానికి మరమ్మతులు చేయాలని ఎంపీటీసీ సభ్యురాలు చొల్లంగి సత్యవతి కోరారు. సభ్యులు సమావేశంలో ప్రస్తావించిన ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ సేవలపై రైతుల్లో అవగాహన పెంచాలి

- మంత్రి చెల్లుబోయిన వేణు
- వ్యవసాయాధికారులతో సమీక్ష



వ్యవసాయాధికారుల సమీక్ష సమావేశంలో మంత్రి వేణు

రామచంద్రపురం: ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలపై రైతుల్లో అవగాహన పెంచాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశించారు. నియోజకవర్గంలోని వ్యవసాయ, గృహనిర్మాణ శాఖల అధికారులతో పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పండించిన ప్రతి గింజకూ సంబంధించి రైతుకు గిట్టుబాటు ధర అందాలనేదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ క్రమంలో ఏవైనా చిన్నచిన్న సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు ముందుటానని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఏవైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రసాయన ఎరువులు వాడుతున్న నేపథ్యంలో భూసార పరీక్షలు చేయించుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. భూసారం పెంపుదలకు రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

గృహ నిర్మాణాలకు అనువైన సమయం

గృహ నిర్మాణాలకు ప్రస్తుతం అనువైన సమయమని, లబ్ధిదారులు వెంటనే ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని గృహనిర్మాణ శాఖాధికారులను మంత్రి వేణు ఆదేశించారు. నియోజకవర్గంలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులపై ఆయన సమీక్షించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంకా గృహ నిర్మాణాలు మొదలుపెట్టని లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

గృహసారథులు ప్రజలతో మమేకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

మండపేట: గృహసారథులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి స్థానికులతో మమేకమై 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని ఏడిదలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ అధ్యక్షతన గురువారం గృహసారథులకు ఏర్పాటు చేసిన సమావేశానికి పృథ్వీరాజ్ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, పార్టీనేత కుడిపూడి రాంబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు రెండు వారాల పాటు జరిగే కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఎంతో బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలు తెలుసుకోవడంతో పాటు టీడీపీ అవినీతి పాలనకు, జగనన్న సంక్షేమ, పారదర్శక పాలనకు వ్యత్యాసం ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు పట్నాల నాగబాబు, పార్టీ నాయకులు బేతా వెంకటేశ్వరరావు, బూరిగ జానీ, రామిశెట్టి వీర్రాజు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ద్వారపూడిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యువనేత తోట పృథ్వీరాజ్, సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు తదితరులు హాజరై గృహసారథులకు కిట్లు అందజేశారు. పార్టీ నాయకులు సంగిశెట్టి రమేష్, పోతుల దుర్గాప్రసాద్, సుబ్బరాజు, దూలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మెర్నిపాడులో జరిగిన సమావేశంలో పృథ్వీరాజ్, సర్పంచ్ గారపాటి సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై సురేష్, తదితరులు

రాయవరం: స్థానిక మదర్ థెరిసా యూత్ ఆధ్వర్యంలో గ్రామంలోని పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై పీవీవీ సురేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చలివేంద్రాలు ఏర్పాటు వల్ల పాదాచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉపసర్పంచి బొడ్డు శ్రీను, బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు చంద్రమళ్ల సంజయ్‌రాజ్, బసవరాజు, చంద్రమళ్ల రత్నం, దువ్వ చంద్రశేఖర్, కందుకుఊరు గంగరాజు, యూత్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రాయవరం: భార్య కనిపించడం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఎస్సై పివివి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలం కోరాడ గ్రామానికి చెందిన ఉడ్రాసి చినబాబు తన భార్య శ్రావణితో కలిసి గత ఎనిమిది నెలలుగా మాచవరంలోని ఇటుక బట్టీలో పని చేసుకుంటున్నారు. గత మార్చి 30వ తేదీ సాయంత్రం నుంచి శ్రావణి కనిపించకుండా పోవడంతో బంధువులు ఇళ్ల వద్ద, పరిసర గ్రామాల్లో వెతికిన ప్రయోజనం లేకపోవడంతో చినబాబు గురువారం రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

